క్లుప్తంగా

వెంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస పూజలు



డోన్ : స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా శుక్రవారం భక్తులు భూదేవి గోదాదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చన, అలంకారం, అష్టోత్తర శతనామావళి, మహానివేదన తదితర పూజలు చేసి మంగళ నక్షత్ర హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మల ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజినీకుమారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు శ్రీవిద్యానికేతన్ కరస్పాండెంట్ చెన్నమ్మ తెలిపారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు మిక్సీ, రైస్, పప్పుకుక్కర్‌తోపాటు కన్సలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు.

అవుకు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మండల కేంద్రం అవుకులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సతీమణి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి బహుమతుల ప్రదానం చేస్తారని తెలిపారు.

పెండేకంటి కుటుంబానికి పరామర్శ



పెండేకంటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: సంజామలకు చెందిన కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్ తల్లి పెండేకంటి ప్రమీలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, చల్లా విక్రాంత్‌రెడ్డి తదితరులు గ్రామాన్ని చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: సంజామల మండలం కానాల గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రాయలసీమ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు.భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా మహిళలు మగ్గులు వేశారు. సుమిత్రకు మొదటి బహుమతిగా ప్రెసర్‌కుక్కర్, కావేరికి ద్వితీయ బహుమతిగా ఇడ్లీపాత్ర, పోటీల్లో పాల్గొన్న మహిళలకు కన్సలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా శారదమ్మ వ్యవహరించారు. యూనియన్ నాయకులు రామచంద్ర, రాంబాబు, బాలస్వామి ఆర్థిక సహకారంతో బహుమతులు పంపిణీ చేశారు.

చురుగ్గా సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు



సీసీ రోడ్డుకు క్యూరింగ్ పెట్టిన దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయం పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో సీసీ రోడ్డుతోపాటు డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఈ గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పర్యటించగా ప్రజలు వివిధ సమస్యలను విన్నవించారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఈ గ్రామానికి ప్రత్యేకంగా డీఎంఎఫ్ పథకం కింద రూ.45 లక్షలు, అలాగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మరో రూ.6లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఎస్సీ కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టామని మండల పంచాయతీ రాజ్ ఏఈ వెంకటరమణ తెలిపారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల



ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు నేరుగా అందజేస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పెట్నికోట గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ సేవలను సచివాలయంలోనే అందిస్తారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని రీతిలో అర్హత ఉంటే చాలు పథకాలు అందిస్తున్నది ఏకైక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటకోసం ఎక్కడా వెనుకడుగు వేయకుండా అన్ని పథకాలు అమలు చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తుంటే ప్రతిపక్షాలు నిందలు వేయడం విచారకరమన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమానంగా ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామని వివరించారు. ఎన్నో ఏళ్ల నుంచి సొంత ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటిస్థలంతో పాటు గృహాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని, జగనన్న కాలనీలో ముందుగానే రోడ్డు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని గుర్తుచేశారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వర్ రెడ్డి, నాయకులు చంద్రమోహన్ రెడ్డి, కొండారెడ్డి, వెంకటరామిరెడ్డి, సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి,చలం రెడ్డి

బేతంచెర్ల: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివద్ధి పనులు చేపడుతున్నామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామంలో సర్పంచ్ ఆదిలక్ష్మి బాయి, ఈఓఆర్డీ వెంకట రంగనాయకుల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పింఛన్లు వస్తూ నిలిచిపోయాయని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించాలని, గృహాలు మంజూరు చేయాలని ప్రజలు విన్నవించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్ హామీ ఇచ్చారు. అనంతరం ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైస్ చైర్మన్ వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖరయ్య, గూనినాగరాజు, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు నాయక్, రాముడు, ఎద్దులన్న, తిరుమలేశ్వర్‌రెడ్డి, రామనాయుడు గోరుమానుకొండ, సీతారామాపురం సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రతి ఒక్కరూ మోక్ష మార్గానికి సనాతన ధర్మాన్ని పాటించాలని తిరుమలతిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాలశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని బెలుం గ్రామం శ్రీకృష్ణ మందిరంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా డాక్టర్ మల్లువెంకటరెడ్డి హాజరై ప్రసంగించారు. సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, భవిష్యత్ తరాలకు వివరించాలని సూచించారు. అంతకుముందు గోవును భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో అర్చకులు మహేష్‌శర్మ, తెలుగు పండితులు వైవిఎస్ నారాయణరెడ్డి,ఆలయ కమిటి నిర్వాహకులు బాచంవెంకటరెడ్డి, వెంకట శివారెడ్డి,సానబోయిన గొల్ల చంద్రశేఖర్,డీలర్ వెంకట శివారెడ్డి,మాజీ సర్పంచ్ ఉసేని,మాతృమండలి సభ్యురాలు రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



యువకులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి

అవుకు: యువత క్రీడాల్లో రాణించాలని, క్రీడాకారులకు తమవంతు సహకారం అందజేస్తామని జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక చల్లా కార్యాలయంలో ఆమె తన కుమారులు చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా మండలానికి చెందిన యువకులకు రెండు వాలీబాల్స్‌ను, నెట్‌ను పంపిణీ చేశారు. నియోజకవర్గస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభచాటి మండలానికి పేరు తేవాలని ఈ ఒసదర్భంగా ఆమె యువతకు సూచించారు. అదేవిధంగా క్రీడలతో మంచి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. అనంతరం వాలీబాల్ కోర్ట్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించాలని యువకులు కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా విక్రాంత్ రెడ్డి, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. శుక్రవారం మేజర్ గ్రామ పంచాయతీ కోవెలకుంట్ల పరిధిలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షలు అందజేస్తోందన్నారు. సబ్సిడీపై సిమెంట్, ఇనుప కడ్డీలు, గృహ నిర్మాణ సామాగ్రి, ఉచితంగా 20 టన్నుల ఇసుక సరఫరా చేస్తోందన్నారు. అదేవిధంగా పాదుపు మహిళలకు రూ. లక్ష వరకు రుణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఈఓపీఆర్‌డీ రాధిక, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పురాతనవంతెన !



అభివృద్ధికి నోచుకోని పురాతన వంతెన

బనగానపల్లె: బనగానపల్లె నుంచి గుత్తికి వెళ్ల ప్రధాన రహదారిలో దద్దణాల ప్రాజెక్టు సమీపంలో ఉన్న పురాతన వంతెన ప్రమాదకరంగా మారింది. దాదాపు 105 సంవత్సరాల క్రితం బనగానపల్లె సంస్థానాన్ని నవాబ్‌మీర్ గులాంఅలిఖాన్ పరిపాలించుకాలంలో నిర్మించిన వంతెన కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. ప్రస్తుతం ఈ వంతెనపై వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. వంతెన ఇరుకుగా ఉండడంతో అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. జయజ్యోతి, ప్రియసిమెంట్ కంపెనీలకు చెందిన సిమెంట్‌లోడు భారీ వాహనాలు ఈ వంతెనపైనే వెళ్తున్నాయి. అప్పుడప్పుడు ట్రాఫిక్ సమస్య నెలకొని ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధింత అధికారులు స్పందించి వంతెనను వెడల్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కాటసాని



బనగానపల్లె: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయలను ప్రతిబింబించేదే సంక్రాంతి పండుగని, నియోజకవర్గ ప్రజలు కుటుంబ సభ్యులు, పిల్లలతో సంతోషంగా జరుపుకోవాలని, ప్రతి ఇంట్లో భోగభాగ్యాలు, సిరులు కురిపించాలని దేవుడిని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సంక్రాంతి కిట్ల పంపిణీ



పేదలకు కిట్లు అందజేస్తున్న స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం నిరుపేదలకు స్ఫూర్తి సభ్యులు 18 రకాల వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. దాతల సహకారంతో నిరుపేదలకు ఈ కిట్లు అంజేశామని సభ్యుడు సీసంగుంతల మధు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రాము, చంద్ర, హుమాయున్, సురేష్, వెంకటేష్, యోగ, జగదీష్, వసంత తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: యువతీ, యువకులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని చైల్డ్‌ఫండ్ ఇండియా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఖాదర్‌బాషా సూచించారు. శుక్రవారం స్థానిక శ్రీరామమూర్తి పంక్షన్ హాలులో సంస్థ దత్తత గ్రామాలైన సంజామల, ముదిగేడు, కమలపురి, వెలగటూరు, అమడాల, కొత్తపేట, బిజనవేముల గ్రామాలకు చెందిన యువతీ, యువకులతో యూత్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత ఇష్టమైన రంగాలను ఎంచుకుని ఇష్టంగా కష్టపడి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ మేనేజర్ సౌజన్యలత, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంతియాజ్ ఉసేన్, బద్దునాయక్, సిబ్బంది మహేష్, ఉసేని, చెన్నయ్య పాల్గొన్నారు.

సన్మానం



స్వచ్ఛంద సంస్థల సభ్యులను సన్మానిస్తున్న ఓం శాంతి సభ్యులు

బేతంచెర్ల : పట్టణంలోని ఓం శాంతి నిలయంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించారు. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న అన్నపూర్ణ ఆశ్రమ వ్యవస్థాపకులు గౌరి హుసేన్ రెడ్డి, లైఫ్ యువనేత్ర, వీత్రి ఫౌండేషన్, రెడ్ క్రాస్ చైర్మన్, మత సామరస్య చైతన్య వేదిక సభ్యులను ఓం శాంతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్వామి వివేకానందుని బాటలో యువత నడిచి దేశాభివృద్ధికి పాటు పడాలని ఈ సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారీలు విజయ, మాధవి, ఉషారాణి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓం శాంతి సభ్యులు సంజీవయ్య, అంకన్న, నాగ సురేంద్ర పాల్గొన్నారు.

ఆర్బీకే సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి

ప్యాపిలి: ఆర్బీకే సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి తెలిపారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్బీకే సిబ్బంది ఆర్బీకేల్లో రైతులకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడంతో పాటు రైతులకు అవసరమైన సలహాలు ఇవ్వాలన్నారు. రోజూవారీ నివేదికలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన వ్యవసాయ సలహా మండలి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి షేక్షావలి, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, ఏపీఓ రమణ, సలహా మండలి సభ్యుడు బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సత్ఫలితాలు



ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పిస్తున్న విజయకుమార్

బనగానపల్లెరూరల్: ప్రకృతి వ్యవసాయంతో సత్ఫలితాలు వస్తాయని, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇల్లూరుకొత్తపేటలో రైతులు సుబ్బారెడ్డి, దస్తగిరి ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన మిరప పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ రైతులు తమ భూములను ఎప్పుడు ఖాళీగా ఉంచరాదని, ఏదో ఒక పంట సాగు చేస్తూ పంటమార్పిడి పాటించాలన్నారు. ఈ పద్ధతిలో పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ వస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం నరేంద్రారెడ్డి, యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన సీనియర్ అధికారిణి ధనలక్ష్మి, శాస్త్రవేత్తలు బాలరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ముస్లిం మహిళలు



ముగ్గులు వేస్తున్న ముస్లిం యువతులు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీరాంగనర్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీల్లో ముస్లిం యువతులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. మహిళలు వేసిన వివిధ రకాల ముగ్గులు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని మిట్టపల్లె గ్రామ సమీపంలో ఉన్న ఆక్సీలియం విద్యానికేతన ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సిస్టర్ నిర్మల ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అలాగే బోగిమంటలు వేసి, పాలు పొంగించి చక్కెర పొంగలి తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిస్టర్ సుస్మిత, సిస్టర్ సెల్వి తదితర ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని దేవనగర్‌లో జేకేఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన మహిళలకు మన ఫౌండేషన్ సహకారంతో ప్రోత్సాహక బహుమతులను జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్‌ఎస్ బ్రహ్మనందఆచారి చేతుల మీదుగా అందజేశారు.

డోన్ : స్థానిక వైఎస్ఆర్ నగర్‌లోని వృద్ధాశ్రమంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఆశ్రమం ఎదుట వృద్ధులు ఉత్సాహంగా, ఉల్లాసంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. వృద్ధులను ఉత్సాహ పరిచేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు జాన్ ప్రభాకర్ తెలియజేశారు.

లయన్స్‌క్లబ్ సేవలు మరువలేనివి



5వేల ఓపి స్లిప్పులను సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న దృశ్యం

డోన్ : సమాజాభివృద్ధికి లయన్స్ క్లబ్ సేవలు మరువలేనివి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ తెలిపారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెల్విన్ జోన్స్ జన్మదినం సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించి, యశోద హాస్పిటల్ అధినేత డాక్టర్ యశోద ఆర్థిక సాయంతో 5వేల ఓపీ స్లిప్పులను ఆమె భర్త ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ సుంకన్న సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు, గర్భిణులకు నిత్యాన్నదానం నిర్వహించేందుకు కారణమైన డాక్టర్ సుంకన్న, యశోద దంపతులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమ్యశిల్ప, డాక్టర్ సునిత, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కుసుమ, డాక్టర్ మాధవి, లయన్స్‌క్లబ్ సభ్యులు సలీంద్ర శ్రీనివాసులు, ఎస్‌టి అరుణ్, నీలం ప్రభాకర్, రాజ్‌కుమార్, అంపయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన రోడ్డు టాక్స్‌ను రద్దు చేయాలి



మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: సరుకు రవాణా, ప్రజా రవాణా వాహనాలపై రాష్ట్ర ప్రభుత్వం పెంచిన త్రైమాసిక రోడ్ టాక్స్ ఉత్వర్వులను వెంటనే రద్దు చేయాలని డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, శివరాం, లారీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుగుణాకర్, ఉపాధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు స్థానిక ఎంవీఐ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసనలు తెలిపారు. అనంతరం ఎంవీఐ అధికారి క్రాంతికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కాలం నుంచి రవాణా రంగం అధ్వాన్న స్థితిలో ఉందని, పెరిగిన డీజిల్, పెట్రోల్ కారణంగా కార్మికులకు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

బేతంచెర్ల: రవాణా రంగంపై త్రైమాసిక రోడ్డు ట్యాక్స్‌ని రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పాతబస్టాండులో ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు.

మానసికస్థితి సరిగాలేని భర్తను భార్యకు అప్పగింత

బేతంచెర్ల: తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన బైరెడ్డి ప్రకాశ్ మానసిక స్థితి సరిగా లేక బేతంచెర్ల పట్టణంలో గురువారం తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అతని దగ్గర ఉన్న ఫోన్ నంబరు ఆధారంగా అతని భార్య బైరెడ్డి సానియాకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం బేతంచెర్లకు వచ్చిన సానియాకు ఏఎస్ఐ లింగమయ్య, పోలీస్ సిబ్బంది మద్దిలేటి, దస్తగిరి తదితరులు బైరెడ్డి ప్రకాశ్‌ను అప్పగించారు.

సంప్రదాయాలను మరువ కూడదు



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

బేతంచెర్ల: ప్రపంచ దేశాలకు ఆదర్శమైన మన సంస్కృతి, సంప్రదాయాలను మరువకూడదని వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ కోర్డినేటర్ మోహన్ రావు, రీజనల్ చైర్మన్లు రాజేంద్రకుమార్, కల్కి సతీష్, విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక అమ్మవారిశాల ఆవరణలో వాసవీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు బళ్లాని సూర్య, గుప్త, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండా ఉమాదేవి, లావణ్య ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు రంగు, రంగుల ముగ్గులు వేయగా న్యాయనిర్ణేతలుగా వరలక్ష్మి, లీలాకుమారి, విజయలక్ష్మి వ్యవహరించారు. ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకున్న మాధవికి దివాన్ సెట్, ద్వితీయ స్థానాల్లో నిలిచిన హరిత కుమారి, రామేశ్వరమ్మకు డ్రసింగ్ టేబుళ్లు, తృతీయ స్థానంలో నిలిచిన మల్లిక, జయంతి, విజయలక్ష్మికి గ్రైండర్ మిక్సీలు అందజేశారు. దాతలు బైసాని శేషఫణి, మధు సూధన్ గుప్త, లక్ష్మణ స్వామి సన్స్, గుండా జగన్ మోహన్‌రావు, రామచంద్రయ్య, సుధీర్ కుమార్ సహకారంతో ఈ బహుమతులు అందజేశారు. బాలికల జూనియర్స్ విభాగంలో సాయి విద్య, హిమ బిందుకు కన్సోలేషన్, పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమలులు అనిల్ కుమార్ సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బచ్చు సుబ్రహ్మణ్యం, రాజేంద్ర, విష్ణు మోహన్, మనోహర్, లక్ష్మీనారాయణ, రాజేష్, నాగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.